క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఓదూరు ఫీడర్, చోడవరం సబ్‌స్టేషన్ ఫీడర్, కాకినాడ, రామచంద్రపురం 132 కేవీల మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ డీఈఈ కె.విజయానంద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చోడవరం 11కేవీ, ఓదూరు 11కేవీ ఫీడర్లు, 11 కేవీ కొత్తూరు అగ్రికల్చర్, ఇండస్ట్రియల్ ఫీడర్ మోటారు లైన్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీంతో చోడవరం నూకల మిల్లు, ఎస్ఎస్‌పేట, ఓదూరు, చోడవరం పరిధిలోని అగ్రికల్చర్ సర్వీసులకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

తోట విజయాన్ని కాంక్షిస్తూ పూజలు



పూజ అనంతరం అర్చకుడికి బియ్యాన్ని అందిస్తున్న శ్రీనివాస్

మండపేట: వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు భారీ విజయం కలగాలని ఆకాంక్షిస్తూ పట్టణంలోని ఆంజనేయ స్వామివార్ల ఆలయాల్లో పార్టీ నాయకుడు అంజూరు శ్రీనివాస్‌చౌదరి మంగళవారం ప్రత్యేక పూజలు జరిపించారు. కేపీ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయం చెంత, మెయిన్ రోడ్డు స్టేట్‌బ్యాంకు వద్ద ఉన్న ఆంజనేయ ఆలయాల్లో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రెండు ఆలయాల్లో స్వామి వారికి సేవలు చేస్తున్న అర్చకస్వాములకు 25 కిలోల చొప్పున బియ్యం బస్తాలను అందించి, వారి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న తోట త్రిమూర్తులుకు తిరుగులేని భారీ విజయాన్ని చేకూర్చాలని స్వామి వారిని వేడుకున్నట్టు తెలిపారు.

షిర్డీ సాయి జ్ఞాన మందిర వార్షికోత్సవం



జ్ఞాన మందిర వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న పూజలు

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో షిర్డీ సాయిబాబా జ్ఞాన మందిరం 22వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, విజయలక్ష్మి దంపతులతో ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, రుద్రాభిషేకం, సామూహిక సాయి సత్యవ్రతాలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం బాబాను పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కాజులూరు: రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. మంగళవారం అయితపూడిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. సర్పంచ్ పెద్దిరెడ్డి చంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి చెందిన వైద్య నిపుణులు ప్రేమ్‌కుమార్, శ్రీయ, సౌజన్య, శ్రీలలిత తదితరులు 319 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి చికిత్స అందించి, ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పిస్తున్నామని డాక్టర్ సౌజన్య తెలిపారు.

శిరోముండనం తీర్పుపై దళిత సంఘాల పెదవి విరుపు

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెం శిరోముండనం కేసు తీర్పు నేపథ్యంలో బాధితుడు కోటి చిన్నరాజు, దళిత ఐక్య పోరాట వేదిక నాయకులు మంగళవారం వెంకటాయపాలెం గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కేసు తీర్పు దోషులకే అనుకూలంగా ఉందని తాము భావిస్తున్నామన్నారు. దీనిపై గవర్నర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత ఐక్య పోరాట వేదిక కో-కన్వీనర్ చీకట్ల వెంకటేశ్వరరావు, నాయకులు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ సిద్ధు, రేవు నాగేశ్వరరావు, గుబ్బల శ్రీను, వెంటపల్లి రామకృష్ణ, అంబటి కృష్ణ, మేడిశెట్టి ఇజ్రాయేలు, ఆకుమర్తి చిన్నమాదిగ, చింతా రాజురెడ్డి, సాదే రాజేష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం..

- సీతారాముల కల్యాణానికి వేళాయే..
- నేడు శ్రీరామ నవమికి ముస్తాబైన ఆలయాలు
- సత్యవాడలో 150 ఏళ్లుగా ప్రత్యేకత
- రెండు నియోజక వర్గాల్లో ఉత్సవ విశిష్టత



అంగరలో పూలతో అలంకరించిన ఆలయం. (అంతర చిత్రం) సీతారాముల వారు



నేలటూరు శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో స్వామి కల్యాణం (ఫైల్)

కపిలేశ్వరపురం: సీతారాముల కల్యాణ వేళ రానే వచ్చింది. చిన్నారుల నుంచి పెద్దల వరకూ ఉత్సవాల నిర్వహణలో సందడి కనిపిస్తోంది. సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి సమ్మేళన ప్రతీకను చూడగానే కుటుంబ బాంధవ్యాలు కళ్ల ముందు ఆవిష్కృతమవుతాయి. భార్యాభర్తల అన్యోన్యత, అన్నదమ్ముల ఆప్యాయత, ఆదర్శ మూర్తిపై విధేయత.. ఇలా కుటుంబంలోని అనేక కోణాలు మానవ జీవిత పరమార్థాన్ని తెలియజేస్తాయి. పుణ్య దంపతులకు ప్రతీకగా కొలిచే సీతారాముల వారి కల్యాణం కనువిందుగా నిర్వహించడం రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఆచారంగా వస్తోంది. ఆయా పట్టణాలతో పాటు, 119 గ్రామాల్లోని రామాలయాలు కల్యాణానికి ముస్తాబయ్యాయి.

క్షేత్ర స్థాయిలో ఐక్యతకు ప్రతీక

ఉత్సవాల నిర్వహణ తరతరాలుగా గ్రామాల ప్రజానీకం మధ్య ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. ఆలయ సమీపంలోని గ్రామస్తులు కులాలకతీతంగా ఉత్సవ నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసుకుని, సమన్వయంతో కల్యాణోత్సవాలను నిర్వహిస్తారు. దాతల సహకారాలతో ఆలయాలకు రంగులను వేయించి ముస్తాబు చేయిస్తారు. ఆధ్యాత్మిక గీతాలాపన, భజన, ఏకాహ కళాకారులంతా ఉత్సవ చలువ పందిళ్లలో తమ కళను ప్రదర్శిస్తుంటారు. బెల్లం పానకం, వడపప్పును ప్రసాదంగా పంచుతూ, తోటివారితో ఆప్యాయంగా వ్యవహరిస్తారు.

పానకం.. ప్రీతికరం

శ్రీరామునికి ఇష్టమైన బెల్లం పానకం, వడపప్పును నైవేద్యంగా స్వామికి సమర్పిస్తారు. నైవేద్యమనే ఆధ్యాత్మిక అంశంతో పాటు, వాటిలో మిళితమైన పదార్థాలు ఆయుర్వేద గుణాలుండటంతో ఆరోగ్యాన్నిస్తాయి. వేసవి ఆరంభ కాలంలో వచ్చే శ్రీరామ నవమి ఉత్సవంలో ప్రసాదంగా బెల్లం పానకం, వడపప్పును భక్తులకు ప్రసాదంగా అందజేస్తారు. బెల్లం, మిరియాలు, యాలకులతో తయారు చేసిన పానకంలో ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, పుష్కలంగా లభిస్తాయి. సీజన్‌లో వచ్చే గొంతు సంబంధిత సమస్యలు తగ్గుతాయి. పెసరపప్పు శరీర వేడిని తగ్గించి చలవ చేస్తుంది. హిందూ వివాహ వేడుకలో ఎదురింపు సన్నాహాల నేపథ్యంలో పానకాల కావిడితో వియ్యాల వారికి స్వాగతం పలకడమనే ఆనవాయితీ శ్రీరామ నవమి వేడుకల నుంచే వచ్చిందని అర్చక స్వాములు చెబుతున్నారు.

రెండు నియోజక వర్గాల్లో సందడి

ద్రాక్షారామలో భీమేశ్వరాలయ ప్రాంగణంలో కల్యాణాన్ని నిర్వహిస్తారు. మండపేట పట్టణంలోని బురుగుంట చెరువు వద్ద సీతారామ క్షేత్రంలో స్వామి కల్యాణ వేడుకలను ఏటా ఘనంగా నిర్వహిస్తారు. కొండపల్లి వారి రామాలయం, వల్లూరివారి వీధి, గొల్లలగుంట, రజక, మత్స్యకార వృత్తిదారుల ఏరియా, గొల్లపుంత తదితర ప్రాంతాల్లోని రామాలయాలు కల్యాణానికి సిద్ధమయ్యాయి. రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) ఆధ్వర్యంలో కల్యాణ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఆచారాలను వదులుకోవద్దు



శ్రీరామ నవమి ఉత్సవం అత్యంత ప్రాధాన్యమైనది. ఆధునికత పేరుతో ఉత్సవ నిర్వహణను ఏమాత్రం తప్పుదోవ పట్టించవద్దు. స్వామికి అత్యంత ప్రీతికరమైన బెల్లం పానకాన్నే ప్రసాదంగా భక్తులకు అందజేయాలి. రస్నా, కూల్‌డ్రింకులు తదితర ద్రవ పదార్థాలను అందజేయడం సరైనది కాదు.

– కణ్వ మహర్షి, పామర్రు, కె.గంగవరం మండలం

కాగితాలంకరణతో రాముని కల్యాణం

- నవమికి సిద్ధమైన సత్యవాడ



కాగితపు పువ్వులు తయారు చేస్తున్న చెరువు వీధి బాల భక్త భజన కమిటీ



చలువ పందిళ్లలో అలంకరించేందుకు సిద్ధం చేసిన కాగితపు పువ్వులు

కె.గంగవరం: సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తరతరాలుగా ఘనంగా నిర్వహిస్తూ తన కీర్తిని చాటుకున్న కుగ్రామం సత్యవాడ. శ్రీరాముని కల్యాణ మహోత్సవమంటే ప్రతి కుటుంబం తన సొంత ఇంటిలోని వివాహం లాగే భావించి, కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురుచూస్తుంటారు. స్వామివారి అలంకరణకు రేయింబవళ్లు శ్రమిస్తూ, తరతరాలుగా వస్తున్న తమ కళా నైపుణ్యంతో శ్రీరామచంద్రుడిని అంగరంగ వైభవంగా అలంకరిస్తారు. రెక్కాడితే కానీ డొక్కాడని వారి దైనందిన జీవితంలో కూడా పురుషోత్తముడైన శ్రీరామునికి తమ ఆధ్యాత్మిక చింతనను తెలియజేయడానికి వారు తపన పడుతుంటారు.

ఉగాదికి రాట మూహూర్తం

150 ఏళ్ల చరిత్ర కలిగిన సత్యవాడ గ్రామస్తులు ఏటా ఉగాది పర్వదినం రోజున శ్రీరాముని కల్యాణానికి రాటముహూర్తం చేస్తారు. అనంతరం చలువ పందిళ్లు వేసి వంశపారపర్యంగా వస్తున్న కళా నైపుణ్యాన్ని కాగితపు పూలతో అలంకరించి, శ్రీరామునికి తమ కళాత్మకతను నైవేద్యంగా సమర్పిస్తారు. తమలోని భక్తిభావాన్ని తెలియజేయడమే కాకుండా, సమైక్యతా భావాన్నీ పంచడంలో ముందున్నారు.

వారం రోజుల శ్రమ

సుమారు 8 వేల గ్రామ ప్రజల చేతినైపుణ్యం 30 రోజుల ముందు నుంచి మూడు చలువ పందిళ్లు, ఏడు రోజుల పాటు శ్రమించి అలంకరణ చేయడం వీరి ప్రత్యేకత. పిల్లలు, పెద్దలు, వృద్ధులు సైతం కాగితపు పూల తయారీలో అందెవేసిన చేయి. తమ గ్రామానికి ప్రత్యేక గుర్తింపు రావాలని భద్రాచలంలో మాదిరిగానే ఏటా ఇక్కడ శ్రీరామనవమి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. రంగురంగుల కాగితాలతో పువ్వులను తయారు చేసి, వాటిని నవమికి వేసిన చలువ పందిళ్లలో ఎంతో అందంగా అలంకరిస్తారు. ఈ వంశపారంపర్య మహోత్సవాన్ని ఎన్ని వ్యయప్రయాసలు ఎదురైనా నేటికీ నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. కాగితపు పూలతో తయారు చేసిన చలువ పందిళ్లలో కల్యాణ రాముడిని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. బుధవారం జరిగే నవమి ఉత్సవానికి ఇప్పటికే దూరప్రాంతాల బంధువులు ఇక్కడకు చేరారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



కోలంక పంచాయతీలో కార్యదర్శికి రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు

కాజులూరు: కోలంకలో 19 మంది సచివాలయ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. మంగళవారం గ్రామ సచివాలయంలో కార్యదర్శికి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు గుబ్బల సతీష్, పంపన మధు, కేదాశి నాని, రాయి కొండ, లంక రమేష్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లుగా పింఛన్ల పంపిణీతో పాటు, పలు ప్రభుత్వ పథకాలు అబ్ధిదారులకు చేరవేయడంలో ఆయా కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉన్నామన్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలు తమపై అర్థం లేని ఆరోపణలు చేయడంతో, ఈసీ తమను విధులకు దూరంగా ఉండాలని ఆంక్షలు విధించిందన్నారు. దీని వల్ల వృద్ధులు, వికలాంగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారికి నిరంతరం తమ సేవలందించాలనే ఉద్దేశంతో రాజీనామా చేశామన్నారు.

నెలపర్తిపాడులో..

రామచంద్రపురం రూరల్: ప్రతిపక్ష నేతల చర్యలకు నిరసనగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌కు మద్దతుగా నెలపర్తిపాడు పంచాయతీకి చెందిన ఐదుగురు వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. వలంటీర్లు ముత్యాల సతీష్, పితాని చక్రవర్తి, దెయ్యాల రామకృష్ణ, పోలినాటి సురేష్, బొండాడ వెంకట్రావులు ఎంపీడీఓ ఎన్వీ రామచంద్రమూర్తిని కలసి తమ రాజీనామా పత్రాలను సమర్పించారు. స్థానిక నాయకుడు రాయుడు వీర్రాజుతో వెళ్లి సూర్యప్రకాశ్‌ను కలసిన వారంతా వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

ఎంపిక చేసిన పాఠశాలల్లో శ్లాస్ పరీక్ష

సఖినేటిపల్లి: మండలంలో ఎంపిక చేసిన ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నాలుగో తరగతి పిల్లలకు శ్లాస్ (స్టూడెంట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షలు ఓఎంఆర్ విధానంలో నిర్వహించినట్టు ఎంఈవో-1, 2 డి.కిషోర్ కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు తెలిపారు. స్లాస్ సర్వే ద్వారా విద్యార్థులు సాధించిన అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు పల్లిపాలెం ఆశ్రమ పాఠశాలలో ఈ పరీక్షను బి.కిషోర్ నిర్వహించారు. హెచ్ఎం రత్నరాజు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు. కాగా పల్లిపాలెం ఆశ్రమ పాఠశాలతో పాటు మూలగొంది ఎంపీపీఎస్, రామేశ్వరం, అంతర్వేదిపాలెం, మోరి ఉన్నత పాఠశాలలు ఉన్నాయని ఎంఈవోలు తెలిపారు.

నిలిచేది.. గెలిచేదీ తోట త్రిమూర్తులే..



ఎన్నికల ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

- వదంతులు నమ్మొద్దు
- పార్టీ రాష్ట్ర నేతలు రాజబాబు, పట్టాభి

మండపేట: వైఎస్సార్ సీపీ మండపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులే పోటీ చేస్తారని, ఆయనపై వస్తున్న వదంతులను పట్టించుకోవద్దని పార్టీ రాష్ట్ర నేత రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు), రైస్ మిల్లర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణితో కలిసి 28వ వార్డులో పర్యటించారు. బిక్కిన అమ్మన్ననగర్, పార్థసారథి నగర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వెనుక వీధి, గాంధీనగర్ వీధి తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. కౌన్సిలర్ మొండి భవానీమురళి వార్డులోని ఇంటింటికీ తీసుకువెళ్లారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను రాజబాబు, పట్టాభి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోట త్రిమూర్తులు ఎన్నికల బరిలో ఉంటున్నారని, దీనిపై విపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలెవ్వరూ నమ్మవద్దన్నారు. ప్రజలంతా తోట త్రిమూర్తులుకు అండగా ఉన్నారని, భారీ మెజార్టీతో ఆయనను గెలిపించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వడానికి మండపేట నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, పిల్లి సుబ్బారావు, రెడ్డి రత్తయ్య, మీసాల రమణ, ఎస్‌డీ కరీముల్లా, జెట్టి బాబూరావు, పేకేటి మాణిక్యం, కాటా సత్తిబాబు, జంపా రాంబాబు, మొండెం వరహాలు, షేక్ రోహిత్, మొండెం పైడిరాజు, కాటా జయమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు మీగడ శ్రీనివాస్, షేక్ అలీఖాన్‌బాబా, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, నాయకులు సిరిపరపు శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, మలసాని సీతామహలక్ష్మి, బొక్కా సరస్వతి, అమలదాసు లక్ష్మి, మారిశెట్టి సత్యనారాయణ, నీలం దుర్గమ్మ, ముక్కా దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం జగనే మళ్లీ సీఎం కావాలి



శీలలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న సూర్యప్రకాశ్

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్

కాజులూరు: రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. శీలలో పార్టీ బీసీ సెల్ మండల కార్యదర్శి దొమ్మేటి కొండ ఆధ్వర్యంలో పలువురు కాపు సామాజిక వర్గానికి చెందిన యువకులు టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి పిల్లి సూర్యప్రకాశ్ పార్టీ కండువాలు వేసి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలనలో రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మరళా వైఎస్సార్ సీపీని గెలిపించుకోవటం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పథకాలను పొందగలుగుతారన్నారు.

రాములోరి కల్యాణానికి వేదికలు సిద్ధం



వెలంపాలెం వేద పాఠశాలలో రాములోరి కల్యాణానికి సిద్ధమైన వేదిక

రామచంద్రపురం రూరల్: శ్రీరామ నవమి పురస్కరించుకుని రాములోరి కల్యాణానికి వేదికలు సిద్ధమయ్యాయి. ద్రాక్షారామ మార్కెట్టు, సూర్యా వీధి, తోటపేట, నరసాపురపుపేట, వెల్ల, వెలంపాలెం వేద పాఠశాల తదితర చోట్ల చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. వెలంపాలెంలో శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి, చంద్రశేఖరేంద్ర భారతీస్వామ స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా చేస్తున్న రాములవారి కల్యాణం కోసం భారీ ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని మార్కెట్‌లో వర్తక సంఘం ఆధ్వర్యంలో 1955 నుంచి సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశం

మండపేట: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ హాజరయ్యారు. సంఘ నాయకులు డి.రాకేష్, సంకా బాబ్జి, కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్యభవాని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోటకు దళితుల ఘన స్వాగతం

సంఘీభావం తెలిపిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



తోట త్రిమూర్తులుకు స్వాగతం పలుకుతున్న దళితులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

మండపేట: శిరో ముండనం కేసులో శిక్ష పడి అనంతరం బెయిల్‌పై మంగళవారం విశాఖపట్నం నుంచి మండపేట వస్తున్న ఎమ్మెల్యే, మండపేట వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులకు ద్వారపూడిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అలాగే ఆ పార్టీ దళిత నాయకులు ఘన స్వాగతం పలికారు. విశాఖ నుంచి ద్వారపూడి మీదుగా ఆయన మండపేట వచ్చిన సందర్భంగా ద్వారపూడి వంతెన వద్ద పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్న బాబు, పార్టీ నాయకులు జెడ్ మేడపాడు మాజీ సర్పంచ్ కొచ్చర్లకోట నరసింహారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాస్, ఏడిద గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్ తో పాటు ద్వారపూడి, జెడ్ మేడపాడు, కేశవరం గ్రా మాలకు చెందిన వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి బాణసంచా కాల్చి ఘనస్వాగతం పలికారు. అలాగే తిప్పనపాడు తాపేశ్వరం మండపేట వంతెన వద్ద కూడా పార్టీ నాయకు లు కార్యకర్తలు పెద్ద ఎత్తున త్రిమూర్తులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ కార్యకర్తలు ఎవరూ ధైర్యం కోల్పోవద్దని అన్నా రు. తాను ఎన్నికల్లో పోటీ చేస్తానని, కోర్టు తీర్పును తాను గౌరవిస్తానని, అయితే తనకు అన్యాయం జరగడంతో న్యాయం కోసం హైకోర్టుకు వెళతానని తెలియజేశారు. తనకు శిక్ష పడడంతో ప్రతిపక్ష టీడీపీ నాయకులు రకరకాలుగా వ్యాఖ్యానాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కేసును కొట్టి వేయించుకోవడానికి వైఎస్సార్ సీపీలో చేరానని విమర్శలు చేశారని, అయితే ఇప్పుడు తీర్పును బట్టి వారు సమాధానం చెప్పాలన్నారు. వారందరికీ ఈ ఎన్నికల్లోనే మరోసారి గుణపాఠం చెబుతారని అన్నారు. 1997లో ఈ సంఘటన జరిగిందని ఆ తరువాత 1999లో టీడీపీ తరఫున తాను పోటీ చేస్తే రామచంద్రపురం నియోజవర్గంలోనే అత్యధిక మెజార్టీతో గెలిచానని, ఆ తర్వాత కూడా మరోసారి టీడీపీ లోను, ఇంకోసారి కాంగ్రెస్ పార్టీలోనే గెలిచానని, రానున్న ఎన్నికల్లో కూడా విజయం సాధిస్తానన్నారు. మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఎస్సీ సెల్ నాయకులు టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఏపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



సత్యశర్మకు జ్ఞాపికను అందిస్తున్న నాయకులు

మండపేట: ఏపీటీఎఫ్ ఏర్పడి 80 ఏళ్లయిన సందర్భంగా మండలంలో మంగళవారం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫెడరేషన్ ఏర్పాటు చేసిన తాపేశ్వరం గ్రామంలో వేడుకలు జరిగాయి. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు అధ్యక్షత వహించారు. ఫెడరేషన్ వ్యవస్థాపకుడు మారెళ్లపూడి పుత్రసత్యశర్మ మనవడు పుత్రసత్యశర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు అప్పట్లో ఈ సంఘం ఏర్పడిందన్నారు. నేడు ఈ సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సి ఉందన్నారు. విద్యారంగంలో అసమానతలను తొలగించేందుకు కృషి జరగాలని చెప్పారు. సంఘ ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం పుత్రసత్యశర్మను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందించారు. ఉపాధ్యాయుల ప్రగతి ప్రధాన సంపాదకుడు జి.సత్యనారాయణ, ఐఫియా నాయకులు కె.సుబ్బారెడ్డి, గౌరవాధ్యక్షుడు ఏ.సదాశివరావు, నాయకులు రామారావు, లక్ష్మణరావు, కేవీవీ సత్యనారాయణ, ఉదయ బ్రహ్మం, కనుపూరి సుబ్బారావు, కనుపూరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై హత్యాయత్నం ప్రతిపక్షాల కుట్రే!

తూర్పు గోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆశీర్వాదం



మండపేట: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం సంఘటన ముమ్మాటికీ ప్రతిపక్షాల కుట్రేనని తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బూరిగ ఆశీర్వాదం ఆరోపించారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ సభల్లోనే పవన్ కల్యాణ్ అనేక సందర్భాల్లో అంతు చూస్తానంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హెచ్చరించినట్టు గుర్తుచేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోలేక, దుశ్చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కుట్రలు చేయడంలోనూ, వెన్నుపోట్లు పొడవడంలోనూ బాబు దిట్ట అని ఎద్దేవా చేశారు. వారి పన్నాగాలేమీ ప్రజాక్షేత్రంలో పారవన్నారు. ప్రజలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారని, ఈ ఎన్నికల్లో 175 అసెంబ్లీ సీట్లు, 25 పార్లమెంట్ స్థానాలను ప్రజలు వైఎస్సార్ సీపీకి కట్టబెట్టడం ఖాయమన్నారు.

నేటి నుంచి నామినేషన్ పత్రాల అందజేత

- రేపటి నుంచి స్వీకరణ
- ఎన్నికల అధికారి ఎల్లారావు వెల్లడి

మండపేట: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలను మండపేట తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని ఎన్నికల అధికారి ఎల్లారావు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బుధవారం నామినేషన్ పత్రాల అందజేత ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. మరుసటి రోజు గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవుతుందని తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 వరకూ నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందన్నారు. ఈ నెల 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని వివరించారు. నామినేషన్లను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ మాత్రమే స్వీకరిస్తామని చెప్పారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు లేదా ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేసుకోవడానికి మండపేటలోని ఆర్ఓ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థులు ఎన్నికల నియమావళిలో భాగంగా కార్యాలయానికి వంద మీటర్ల లోపు వారి వాహనాలు 3 మించి అనుమతించబోమని చెప్పారు. అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు.